క్లుప్తంగా

డయేరియాపై అవగాహన ర్యాలీ

రేపల్లె రూరల్: జలజీవన్‌మిషన్, వైద్యశాఖ ఆధ్వర్యంలో గురువారం పేటేరు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు డయేరియాపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. 'మన పంతం-డయేరియా అంతం' కార్యక్రమంలో భాగంగా జరిగిన ర్యాలీలో పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ బాబూజీ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, డయేరియా నియంత్రణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు నీటి పరీక్షల ఆవశ్యకతను ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తేజస్విని, కృష్ణవేణి వివరించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో సుజీవనిరాణి, లావణ్య, ఏఎన్‌ఎం సిరోమణి, మండల కో-ఆర్డినేటర్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం



నగరం: జై హనుమాన్ నామస్మరణతో ఇంకోల్లు వారిపాలెం గ్రామం మార్మోగింది. గ్రామంలో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. కస్తూరి భాస్కరశర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ శాస్త్రయుక్తంగా విశేష పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలు



నగరం: ఇండియన్ బ్యాంక్ ఖాతాదారులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ ఎం.శ్రీకాంత్ చెప్పారు. స్థానిక ఇండియన్ బ్యాంక్‌లో గురువారం జరిగిన వినియోగదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు వ్యవసాయ, బంగారు ఆభరణాలపై అతి తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. డ్వాక్రా మహిళలకు లింకేజీ రుణాలతోపాటు వ్యాపారులకూ అప్పులు ఇస్తున్నట్లు వెల్లడించారు. బ్యాంక్ సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఖాతాదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది దివ్య, చాణిక్య, రాజు, కృష్ణ, ఐశ్వర్య తదితరులు పాల్గొన్నారు.

అతిగా ఎరువుల వాడకం భూసారానికి ముప్పు



వేమూరు (కొల్లూరు) : ఎరువులు, పురుగు మందుల వినియోగం అధికమైతే భూసారానికి ముప్పు వాటిల్లే అవకాశాలు అధికంగా ఉంటాయని మండల వ్యవసాయాధికారిణి చందవోలు సునీత చెప్పారు. గురువారం కుచ్చళ్లపాడులో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆమె రైతులకు సూచనలు చేశారు. ఆమె మాట్లాడుతూ, వ్యవసాయాధికారుల సూచనలను అనుసరించి పంటలకు అవసరమైన మోతాదులోనే రసాయన ఎరువులు, పురుగుమందులు వాడుకోవాలని, లేకుంటే భూమి చౌడుబారడంతోపాటు, పంట దిగుబడులు పడిపోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఏఏలు పాల్గొన్నారు.

నేడు ఐలవరంలో టంగుటూరి జయంత్యుత్సవం

భట్టిప్రోలు: ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధులు టంగుటూరి ప్రకాశం పంతులు జయంత్యుత్సవాన్ని శుక్రవారం భట్టిప్రోలు మండలం ఐలవరం ఖాదీ సొసైటీ ప్రాంగణంలో నిర్వహించేందుకు చేనేత జౌళి శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఖాదీ సొసైటీల స్థాపనకు ప్రకాశం పంతులు విశేష కృషి చేశారు.



బిందెలతో పవిత్ర కృష్ణానదీ జలాలను తీసుకొస్తున్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ

పూజల కోలాహలం

వర్షాలు సమృద్ధిగా కురిసి, పంటలు బాగా పండాలని ఆకాంక్షిస్తూ గురువారం భట్టిప్రోలు మండలం వెల్లటూరు గ్రామంలో కొలువైన ముత్యాలమ్మ, కట్లమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్లకు భక్తులు జలాభిషేకం నిర్వహించారు. 101 బిందెలతో పవిత్ర కృష్ణానదీ జలాలను తీసుకొచ్చి అభిషేకించారు. అర్చకులు క్రోవి రామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవార్లకు పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం ఆలయంలో సామూహిక కుంకుమార్చన, వరలక్ష్మి వ్రతం జరుగుతాయని అర్చకులు వెల్లడించారు. – భట్టిప్రోలు

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

రేపల్లె రూరల్: కాపుసేవా సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని కార్యాలయంలో 15వ వార్షికోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా 2023-24 విద్యాసంవత్సరంలో నియోజకవర్గంలో ప్రతిభ కనబరిచిన టెన్త్, ఇంటర్మీడియెట్ విద్యార్థులు 20 మందికి ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున రూ.60 వేల నగదును ఉపకార వేతనాలుగా అందజేశారు. కార్యక్రమంలో కాపుసేవా సమితి సభ్యులు ఊసా వెంకటసుబ్బారావు, కొలసాని శివశంకరరావు, కంచుకొమ్మల వెంకయ్య, కొలగాని వీరబసవయ్య, మండలి నాగబసవయ్య, కొలగాని పిచ్చియ్యనాయుడు, అడుసుమల్లి కిషోర్, పులగం లక్ష్మీపతినాయుడు, కొచ్చెర్ల ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.



ఉపకార వేతన చెక్కు అందజేస్తున్న కాపుసేవా సమితి సభ్యులు

'ఉపాధి' ప్రతిపాదనలకు ప్రాధాన్యమిద్దాం

కొల్లూరు : ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టబోయే పనుల ప్రతిపాదనలకు గ్రామసభలలో అధిక ప్రాధాన్యమిద్దామని ఎంజీ ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ జె.లక్ష్మి చెప్పారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఈఓపీఆర్డీ రవిబాబు ఆధ్వర్యంలో లక్ష్మి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాలలో తప్పనిసరిగా గ్రామ సభలు నిర్వహించాలని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టబోయే ఉపాధిహామీ పథకం పనులను గుర్తించి, వాటిపై గ్రామ సభలలో చర్చించి ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రజలు తెలిపే అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. కూలీలకు ఉపాధి హామీ పథకంపై అవగాహన కల్పించాలన్నారు. మంచినీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, రహదారులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపైనా గ్రామ సభల్లో చర్చించాలని సూచించారు.



మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు సూచనలిస్తున్న ఏపీఓ లక్ష్మి

చిరంజీవి జన్మదిన వేడుకలు



కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం



చందోలులో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

నిజాంపట్నం/పిట్టలవానిపాలెం : సినీ నటుడు చిరంజీవి జన్మదినం సందర్భంగా అఖిల భారత చిరంజీవి యువత నాయకుడు తోటావెంకట రామారావు ఆధ్వర్యంలో గురువారం కూచినపూడి మెయిన్ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జనసేన నాయకుడు మత్తి భాస్కరరావు పాల్గొన్నారు. కేక్ కట్‌చేశారు. కూచినపూడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. కొలసాని కోటేశ్వరరావు, నల్లపాటి యల్లయ్య, లక్ష్మయ్య, తోటారమేష్, ప్రభాకర్, గూడపాటి శ్రీను, అన్నపురెడ్డి పున్నారావు, గాదే శ్రీను, తోటా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– పిట్టలవానిపాలెం మండలం చందోలులోనూ సినీ నటుడు చిరంజీవి జన్మదిన వేడుకలు నిర్వహించారు. జనసేన మండల అధ్యక్షుడు దాదా ఆధ్వర్యంలో జనసేన బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివన్నారాయణ కేక్ కట్‌చేసి, స్వీట్లు పంచారు. కార్యక్రమంలో చిరంజీవి అభిమానులు మస్తాన్ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు తగవు



భట్టిప్రోలు: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఏపీయూఎస్) ఖండించింది. అక్కడి హిందువులకు సంఘీభావంగా గురువారం భట్టిప్రోలు రథం సెంటర్‌లోని సాయిబాబా మందిరం ఆవరణలో ఏపీయూఎస్ మండల కార్యవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీయూఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు హరిపూర్ణ ప్రసాద్, జిల్లా అధ్యక్షులు ఎన్.ఎస్.కుమార్, సీనియర్ నాయకులు రంగనాథ్, కె.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు కొతరపు రామచంద్రరరావు, రావూరి సత్యనారాయణమూర్తి, సీహెచ్‌వీ ఉమామహేశ్వరరావు, కె.శివరామకృష్ణ, కేవీ. రామారావు, ఎం.చంద్రకిషోర్, సీహెచ్ రాజేష్, కె.చిందబరరావు, కేవీ నాగరాజన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అస్వస్థత



బాపట్లటౌన్: పాఠశాలలో ఓ విద్యార్థిని అస్వస్థతకు గురైన ఘటన ముత్తాయపాలెం గ్రామంలో గురువారం జరిగింది. గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న టి.పవిత్ర పాఠశాలలో ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయింది. భయాందోళనకు గురైన ఉపాధ్యాయులు ఆమెను చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే విద్యార్థినికి జ్వరం 102 ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. వైద్యపరీక్షలు నిర్వహించి సాధారణ జ్వరంగా తేల్చారు. ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినిని ఎంఈఓలు ఎస్.నిరంజన్, ప్రసాదరావు పరామర్శించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి



భట్టిప్రోలు రథం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

భట్టిప్రోలు: కోల్‌కతా వైద్యవిద్యార్థి హత్యాచార ఘటనను ఖండిస్తూ సీఐటీయూ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం భట్టిప్రోలు రథం సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ మండల అధ్యక్షురాలు రమాదేవి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.మనోజ్‌కుమార్ మాట్లాడుతూ నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం, యూటీఎఫ్, అంగన్‌వాడీ సంఘ నాయకులు సత్యనారాయణ, నాగమల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, గోపాలస్వామి, సురేష్‌కుమార్, పున్నారావు, చెల్లమ్మ, మమత పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ బాధితులకు వైద్యపరీక్షలు తప్పనిసరి

రేపల్లె రూరల్: హెచ్‌ఐవీ బాధితులు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని ప్రభుత్వ వైద్యశాల మెడికల్ ఆఫీసర్ ఉల్లంకి సుధాకరం తెలిపారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం, జిల్లా వైద్య ఆరోగ్య శాఖల సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి ఏఆర్‌టీ ప్లస్ సెంటర్‌లో గురువారం వైద్యసేవల విభాగాన్ని ప్రారంభించారు. అనంతరం సుధాకరం మాట్లాడుతూ ఏఆర్‌టీ మందులు వాడే ప్రతిఒక్కరూ తరచూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ సయ్యద్ జాని బాషా మాట్లాడుతూ అందరూ హెపటైటిస్ బీ పరీక్షలు చేయించుకోవాలని, పరీక్షల్లో పాజిటివ్ వస్తే వ్యాక్సిన్ ఉచితంగా వేస్తారని చెప్పారు. కార్యక్రమంలో షేర్ ఇండియా ప్రాజెక్టు ఆఫీసర్ రత్న కుమార్, వైద్యులు పృథ్వి, జీవన్, చైతన్య, హెడ్ నర్సు ఝాన్సీ, కౌన్సిలర్ రాజేంద్రకుమార్, సిరి మహిళా సాధికారత వెల్ఫేర్ సొసైటీ సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రేపల్లె కమ్యూనిటీ వైద్యశాల ఏఆర్‌టీ ప్లస్ సెంటరులో వైద్య సేవల విభాగాన్ని ప్రారంభిస్తున్న మెడికల్ ఆఫీసర్ సుధాకరం

సీపీఎంకు సాయిబాబు సేవలు ఎనలేనివి

రేపల్లె రూరల్/భట్టిప్రోలు: సీపీఎం నాయకుడు దివి సాయిబాబు పార్టీకి అందించిన సేవలు ఎనలేనివని సీపీఎం డివిజన్ కార్యదర్శి మణిలాల్ చెప్పారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన దివి సాయిబాబు 18వ వర్ధంతి కార్యక్రమంలో మణిలాల్ మాట్లాడుతూ సాయిబాబు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. సాయిబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సాయిబాబు కుటుంబ సభ్యులు దివి.రజని, కె.జోషి, దివి.జాహ్నవి, కె.విరాన్ష్, సీపీఎం నేతలు వై.కిషోర్, కె.అశ్విరదాం, కె.గోపీ, ప్రజాసంఘాల నాయకులు కె.సాయిప్రసాద్, జె.ధర్మరాజు, వై.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

– భట్టిప్రోలు రథం సెంటర్లోనూ కామ్రేడ్ సాయిబాబు వర్ధంతి సభ నిర్వహించారు. చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా నాయకులు మురుగుడు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజాపోరాటాల్లో సాయిబాబు చురుకైన పాత్ర పోషించారని గుర్తుచేశారు. సాయిబాబు చిత్రపటానికి పార్టీ నేతలు ఎ.శ్రీనివాసరావు, సీఐటీయూ మండల అధ్యక్షురాలు రమాదేవి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు బి.నాగమల్లేశ్వరరావు, ఎస్.గోపాలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జి.దానియేలు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు పి.మనోజ్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



రేపల్లెలో సాయిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

చర్చి నిర్మాణానికి శంకుస్థాపన



మరకావారిపాలెం(కర్లపాలెం): పెదగొల్లపాలెం పంచాయతీ మరకావారిపాలెంలో పాస్టర్ బోడా లాభాన్‌రాజు ఆధ్వర్యంలో స్థానిక విశ్వాసులు చేపట్టిన చర్చి నిర్మాణానికి ఎమ్మెల్యే నరేంద్రవర్మరాజు కేర్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు మోపర్తి జాన్‌తో కలిసి గురువారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రార్థనా మందిరం నిర్మాణం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు బోడా విలియంరాజు, కాగిత డేవిడ్, మాజీ సర్పంచ్ చుక్కా సుబ్బారావు పాల్గొన్నారు.